# గోదావరి డెల్టా నీటిపారుదల వ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్రసమస్యలపై

# రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యాన వాస్తవ పరిశీలనా బృందం పర్యటన-ప్రాథమిక రిపోర్టు

**గోదావరి** డెల్టా నీటిపారుదల వ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలను పోలవరం ప్రాజెక్టు నేపథ్యంలో అధ్యయనం చేయాలని రైతుకూలీసంఘం (ఆం.ప్ర) భావించింది. ముఖ్యంగా ధవళేశ్వరం కేంద్రంగా సాగిన అనేక అవినీతి చర్యలవల్ల డెల్టా వ్యవస్థ తీవ్రంగా నష్టపోతున్న పరిస్థితిలో దీనిని పరిశీలించడానికి ఒక వాస్తవ పరిశీలనా బృందం ఏర్పడింది. ఈ బృందంలో **రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షురాలు కామ్రేడ్ ఎస్.ఝాన్సీ, రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) పూర్వ రాష్ట్రసహాయ కార్యదర్శి కామ్రేడ్ జె.కిషోర్‌బాబు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గసభ్యులు కా॥ఎం.ఎస్.నాగరాజు,** తదితరులతో ఒక బృందం 2017 జూన్ 15వ తేదీన ఉభయ గోదావరి జిల్లాలోని డెల్టా ప్రాంతంలో తన పర్యటనను జరిపి, తన ప్రాథమిక నిర్ధారణలను పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించింది.

## 1. గత ఘన కీర్తి-నేటి దుస్థితి :

డెల్టా శిల్పి ఆర్థర్ కాటన్ సూపరిండెంటు ఇంజనీరుగా పనిచేసిన, గొప్ప ఇంజనీరింగ్ సాంప్రదాయాలు కల గోదావరి హెడ్ వర్క్స్ డివిజను, గోదావరి డెల్టా ఇరిగేషన్ వ్యవస్థ – నేడు ప్రభుత్వం, కొందరు ఉన్నతాధికారుల పద్ధతి, ప్రవర్తన మూలంగా బాధ్యతారాహిత్యానికీ, అవినీతికీ ఆలవాలంగా మారింది. ఒకప్పుడు ధవళేశ్వరం నుంచి కాలువ చివరల వరకూ; ఇంజనీర్ల నుండి లస్కర్ల వరకూ; రైతులతో, వ్యవసాయంతో సమన్వయంతో సాగిన ఇరిగేషన్ విధానం ఇప్పుడు స్వప్రయోజనాలకు లోనై ఇరిగేషన్ వ్యవస్థను కుప్పకూల్చే స్థితికి తెచ్చింది. లస్కర్ వ్యవస్థ నామమాత్రమైపోయింది. ప్రభుత్వ ఆక్వా ప్రోత్సాహక చర్యలు, 'నాలా' చట్టసవరణలతో కాలువల గట్ల కిందా, గోదావరిలో యధేచ్ఛగా తవ్వకాలు, కట్టుబడులు జరుగుతున్నా అడ్డుకొనే స్థితిలో లేక నిస్తేజంగా ఇరిగేషన్ వ్యవస్థ మారిపోయింది.

## 2. అడ్డు అదుపులేకుండా పెరుగుతున్న అవినీతి – అవినీతిపరులను అందలం ఎక్కిస్తున్న ప్రభుత్వ విధానాలు – కొన్ని ఉదాహరణలు:

కొన్ని పత్రికా ప్రకటనలు, కొందరు మేధావులు సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి సేకరించిన సమాచారం, మా పరిశీలనలలో వెల్లడైన వాస్తవాలు ఏమంటే (ఎ) 2014లో పశ్చిమ డెల్టా, నర్సాపురం పరిధిలోని లక్ష్మణేశ్వరం, రాజుల్లంక ప్రాంతంలో 80వ కిలోమీటర్ నుండి నిర్మించిన గ్రోయన్‌ల నిర్మాణంలో నాసిరకం రాళ్ళను వాడి నిర్లక్ష్యంగా నిర్మించడంవల్ల గ్రోయన్‌లు కుంగిపోవడం, దెబ్బతిని వుండటాన్ని మేము గమనించాము. వీటికి వాడిన ఇటుకరాళ్ళు వర్షాలకు కూడా ధ్వంసం అవుతున్న స్థితిని గమనించాము. (బి) సెంట్రల్ డెల్టా పేరవరం వద్ద 4వ కిలోమీటర్ నుండి సుమారు 100 మీటర్లు పైగా రాళ్ళ కట్టుబడి పునాది రమారమి రెండు మీటర్ల మేర కుంగిపోయి, రాళ్ళూ, కట్టుబడి జారిపోయిన పరిస్థితిని గమనించాము. (సి)పై అక్రమాలపై గత ఇ.ఎన్.సిగానూ, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగాలు విడివిడిగా పరిశీలన జరిపి అక్రమాలను నిర్ధారించగా, విజిలెన్సు అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ వీటికి బాధ్యులైన అప్పటి ఎస్.ఇ. ఎస్.సుగుణాకరరావు, ఈ.ఈ తిరుపతిరావులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వీరిని రిటైరు అయ్యేవరకు ఎలాంటి ప్రాధాన్యతకల స్థానాలలో (ఫోకల్ పోస్ట్) నియమించరాదని, వారు కాంట్రాక్టర్లతో కుమ్మక్కైనారని, నీతి, నిజాయితి (honesty and integrity) కోల్పోయారని చెప్పిన నివేదికలను గమనించాము. (డి) కానీ నేటికీ వారిపై ఎలాంటి క్రమశిక్షణ చర్య తీసుకోకపోగా, వారిని ప్రస్తుతం కీలక స్థానాలలో నియమించటాన్ని చూస్తే, ప్రభుత్వ పెద్దల "అవినీతి రహిత పాలన" అంటే ఇదా అనే అనుమానం కలగకమానదు. (ఇ) దీనిపై మా బృందం మొట్టమొదట నాసిరకం నిర్మాణాలు జరిగిన ప్రాంతాలలో వెంటనే రిపేర్లు జరిపి మరింత నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నది. (ఎందుకంటే తీవ్రమైన వరదలే వస్తే జరిగే నష్టం చాలా ఎక్కువగా వుంటుంది కనుక). అదేవిధంగా అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకొని, వారి నుంచి, బాధ్యులైన కాంట్రాక్టర్ల నుంచి నష్టపరిహారం రాబట్టాలి అని కోరుతున్నది.(ఎఫ్) ఇవికాక, ధవళేశ్వరం బ్యారేజిపైన వుండి, గేట్లు ఎత్తడంలో ఉపయోగపడే బ్రేక్ కాయిల్ యూనిట్లు మొత్తం 175లలో 169 దొంగతనానికి గురైన విషయం మమ్ములను ఆశ్చర్యపరుస్తున్నది. ఒక్కరోజులో ఈ దొంగతనాలు జరుగకపోయినా బ్యారేజి నిర్వహణ ఎంత అధ్వాన్నంగా, బాధ్యతా రహితంగా వుందో అర్థమౌతున్నది. (హెచ్) 2015- 16లలో మూడు డెల్టాల ఇరిగేషన్ అధికారులు కలిసి అప్పటి ఎస్.ఈ గారి నేతృత్వంలో రెండవ పంటకు 100% నీరు సరఫరాకు నీటిని ఎత్తిపోయాలని నిర్ణయించారు. తగిన సమయంవున్నా కృత్రిమ అవసరాన్ని సృష్టించి ఇరిగేషన్ నియమాలకు అనుసరించి ఒక హెచ్ పికి ఒక గంటకు 19 రూపాయలు వుండగా మున్సిపల్ పబ్లిక్ వర్క్స్ వారి నియమాలను బట్టి ఒక హెచ్‌పికి ఒక గంటకు రూ.53 వున్న దానిని ఇక్కడకు తప్పుగా అన్వయించి గంటకు రూ.53 చొప్పున నిర్ణయించి నామినేషన్ పద్ధతిలో పనులు జరిపించారు. (ఐ) పై అంశాల్ని పరిశీలించాక గోదావరి డెల్టాను, రైతాంగాన్ని

కంటికి రెప్పలా కాపాడవలసిన ఇరిగేషన్ వ్యవస్థ ఎంత భ్రష్టు పట్టిపోయిందో దీనిని సమూలంగా ప్రక్షాళన చేయవలసిన రాజకీయ నాయకత్వం ఎలా ఇక్కడి అవినీతికి లైసెన్సు ఇస్తున్నదో అర్థమౌతున్నది.

**3. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ నేపథ్యంలో డెల్టా రైతాంగ ఆయకట్టు హక్కులకు చట్టపర గ్యారంటీ కావాలి :**

నాగార్జునసాగర్ నిర్మాణం జరిగాక ఇప్పుడు ప్రకాశం బ్యారేజి కింద వున్న డెల్టా రైతాంగ అవస్థలను చూస్తున్నాము. 2004లో సాగర్‌లో 520 అడుగుల నీటిమట్టం వున్నా రెండో పంటకు నీరు విడుదల చేశారు. ఈ సంవత్సరం సాగర్‌లో 540 అడుగుల నీటిమట్టం వున్నా రెండో పంటకు రైతులు ఎంతో ఆందోళన చేస్తేగాని అరకొరగా నీరు ఇవ్వలేదు. విశాఖపట్నం పారిశ్రామిక అవసరాల పేరిట ఏలేరు కాలువ కింద సాగుచేస్తున్న రైతులను నీటి దొంగలుగా చూసి కేసులు పెట్టిన సంగతులు తెలిసినవే. ఎద్దడి కాలంలో రెండో పంటకు నీరు అన్నది ప్రభుత్వ దయాదాక్షిణ్యాలమీద కాక రైతుల హక్కుగా వుండాలి. గోదావరి డెల్టాలోని ఆయకట్టుకింద కాలువల చివరి వరకూ సాగునీరు, తాగునీరు ఏ పంటకు ఎంత నీరు నికరంగా ఇస్తారో స్పష్టపరచాలి. ముఖ్యంగా రెండవ పంటకు కావలసిన 90 టి.ఎం.సి.ల నీటిని నికరంగా విడుదల చేస్తామని ప్రభుత్వం జి.వో. రూపంలో బహిరంగంగా ప్రకటించాలి. రైతాంగం తమ ఆయకట్టు హక్కుల (రెపేరియన్) పరిరక్షణ కోసం మెలుకువగా వుండాలని మా బృందం అభిప్రాయపడుతున్నది. ప్రాజెక్టుల మొదటి ప్రాధాన్యత ఇరిగేషన్ మాత్రమే కావాలి. కాని విద్యుత్ ఉత్పత్తి, వాణిజ్య ప్రయోజనాలకోసం ప్రాజెక్టుల ప్రాధాన్యతాక్రమాన్ని మార్చి రైతాంగ ప్రయోజనాలు బలిపెట్టరాదని మేము భావిస్తున్నాము.

**నిర్ధారణలు మరియు డిమాండ్లు :**

ప్రకృతి వైపరీత్యాలనుంచి భూములను, పంటలను, ప్రజలను, కాపాడే వ్యవస్థగా మాత్రమే గోదావరి డెల్టా ఇరిగేషన్ వ్యవస్థను నిర్వహించాలి. నాసిరకం పనుల వల్ల దెబ్బతిన్న గ్రోయన్‌లు, పిచ్చింగ్‌లను వెంటనే పూర్తిస్థాయిలో మరమత్తు చేయించాలి. లస్కర్ పద్ధతిని పూర్తిగా పునరుద్ధరించి ఉద్యోగాలలోని అన్ని ఖాళీలను పర్మినెంట్ ఉద్యోగులతో భర్తీచేయాలి. గోదావరిలో, కాలువలలో అన్నిరకాల ఆక్రమణలు తొలగించాలి. అన్నిరకాల అవినీతిని నిర్మూలించాలి. గత అవినీతి అధికారులపై కఠిన శిక్షలు అమలుచేయాలి. గ్రామాల, రైతాంగ, ఇంజనీరింగ్ అధికారుల సమన్వయముతో ఇరిగేషన్ వ్యవస్థ నడవాలి. రైతుల ఆయకట్టు హక్కులకు స్పష్టమైన చట్టపర హామీలను ప్రభుత్వం ఇవ్వాలి. రైతాంగం, ప్రజల ఆందోళనలో వున్న పై అంశాలపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు వెంటనే తీసుకోవాలని మా బృందం అభిప్రాయపడుతున్నది.

oooo